'మృగశిర' చేప కోసం..



వెంకటాపూర్ తాళ్లకుంట వద్ద చేపలు విక్రయిస్తున్న ముదిరాజ్ మత్స్యకారులు

ఘట్‌కేసర్: మృగశిర కార్తె ప్రవేశించడంతో శనివారం చేపల విక్రయాలు జోరుగా సాగాయి. చేపల విక్రయ కేంద్రాల వద్ద ప్రజలు ఉదయం నుంచి బారులు తీరారు. మండలంలో అంకుషాపూర్, వెంకటాపూర్, ఎదులాబాద్, ఘట్‌కేసర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా, బాలాజీనగర్, కొండాపూర్ గేటు, ఎన్ఎఫ్‌సీ నగర్‌లో కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిటలాడాయి. వెంకటాపూర్ తాళ్లకుంట వద్ద చేపల విక్రయాలు జోరుగా సాగాయి. సాధారణ రోజుల్లో కిలో బొచ్చ, రవ్వరకం చేపలు కిలో రూ.150 విక్రయిస్తుండగా మృగశిర కార్తె సందర్భంగా రూ. 200లకు విక్రయించారు.

బడిబాట



దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించాలని సూచిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీకాంతచారి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శ్రీకాంతచారి మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో ఆధునాతన పద్ధతిలో విద్యాబోధన అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల కోసం సకల వసతులు కల్పిస్తోందని, బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

వెంటనే రుణమాఫీ చేయాలి



కొమ్మిడి శోభారాణి దామోదర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వెంటనే రైతు రుణమాఫీ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, ఎంపీటీసీ శోభారాణి దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్‌లో శనివారం ఆమె మాట్లాడుతూ గద్దెనెక్కిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. మహిళలకు రూ. 2,500, 200 యూనిట్లలోపు ఉచితంగా విద్యుత్ సరఫరా, పెన్షన్ పెంపుదల అమలు కాలేదని గుర్తు చేశారు.

ప్రమాదకరంగా మారిన కల్వర్టులు



డబీల్‌పూర్ నూతన్‌కల్ రోడ్డులో కుంగిన కల్వర్టు

మేడ్చల్: మండలంలోని డబీల్‌పూర్ -నూతన్‌కల్ గ్రామాలను కలిపే ప్రధాన రోడ్డులో ఇస్కాన్ టెంపుల్ సమీపంలో రోడ్డుపై ఉన్న కల్వర్టు కుంగుతుండటంతో అది ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డులో ఇస్కాన్ టెంపుల్ వద్ద కుంటలోని వర్షపునీరు వెళ్లేందుకు వీలుగా కల్వర్టు నిర్మించారు. అయితే కల్వర్టు మధ్యలో పెద్ద రంధ్రం పడి రోజురోజుకూ కుంగిపోతోంది. కల్వర్టుపై కంకర తేలి గుంతలా మారింది. ఏ క్షణమైనా ప్రమాదం జరిగే అవకాశాలు ఉండటంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

హైవేపై మందుబాబు చిందులు



జాతీయ రహదారిపై పడుకుని హంగామా చేస్తున్న మందుబాబు



చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

మేడ్చల్‌రూరల్: మద్యం మత్తులో ఉన్న ఓ తాగుబోతు జాతీయ రహదారిపై వీరంగం సృష్టించాడు. ఈ ఘటన గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో వద్ద 44 జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. అతడి తలకు గాయమై రక్తం కారుతున్నా నడిరోడ్డుపై పడుకొని వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించాడు. పక్కకు జరగాలని, గాయాలకు చికిత్స చేసుకోవాలని వాహనదారులు సూచించగా, వారిపై చిందులు వేశాడు. తనపై ఒకరు దాడి చేశాడంటూ బూతులతో హంగామా చేశాడు. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా సంఘటన స్థలికి చేరుకుని అతడికి చికిత్స నిర్వహించారు. ఆఖరికి అంబులెన్స్ సిబ్బందిపై కూడా అతడు చిందులేశాడు. పోలీసులు రాకుండానే చికిత్స ఎందుకు చేశారంటూ నానా యాగీ చేశాడు.

లోక్ అదాలత్‌లో 1,440 కేసులు పరిష్కారం

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. రెండవ జిల్లా జడ్జి కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించిన లోక్ అదాలత్‌లో జిల్లా జడ్జి జీవన్‌కుమార్ కుటుంబ కేసులను పరిష్కరించారు. కొంతకాలంగా కోర్టు పరిధిలో ఉన్న 1,440 కేసులకు పరిష్కారం లభించింది.

మహిళ అదృశ్యం



రహీసా బేగం (ఫైల్)

ఘట్‌కేసర్: మతిస్థిమితంలేని ఓ మహిళ ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో అదృశ్యమైంది. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని బ్రూక్‌బాండ్ కాలనీకి చెందిన రహీసా బేగం(38) శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వెళ్లి తిరికి ఇంటికి చేరుకోలేదు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె మేనమామ ఖాదిర్‌పాషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తతే కీలకం!



- వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ చర్యలు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా కసరత్తు
- హైరిస్క్ ప్రాంతాలు, బస్తీలు, పల్లెల్లో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి
- పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండేలా... కార్యాచరణ ప్రణాళిక
- వారానికి రెండు రోజులు డ్రైడేగా పాటించేలా ప్రజల్లో అవగాహన

సాక్షి, మేడ్చల్ జిల్లా: వర్షాకాలం వచ్చేసింది. దీంతోపాటు అంటువ్యాధులు కూడా వచ్చే ప్రమాదం ఉంది. అయితే ప్రజలు రోగాల బారిన పడకుండా వైద్యారోగ్యశాఖ అధికారులు ముందస్తు చర్యలు ప్రారంభించారు. అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అప్రమత్తమయ్యారు. జలుబు, దగ్గు, జ్వరంతో వచ్చే రోగులకు మందులు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బోదకాలు, మలేరియా, డెంగీ తదితర వ్యాధులకు సంబంధించిన వైద్యులు సర్కారు దవాఖానాల్లో అందుబాటులో ఉండాలని చెబుతూనే.. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. పాముకాటు చికిత్సలకు కావాల్సిన మందులను జిల్లా వైద్యారోగ్యశాఖ సమకూర్చుకుంటోంది.

గ్రామాలు, బస్తీలపై ప్రత్యేక దృష్టి

మారుమూల గ్రామాలు, బస్తీల ప్రజలకు వైద్యసేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. ఇలాంటి వాటిని గుర్తించిన వైద్యాధికారులు అక్కడి ప్రజలకు మెరుగైన వైద్యమందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే గుర్తించిన హైరిస్క్ ప్రాంతాలతోసహా స్లమ్‌లు, బస్తీలు, గ్రామాల్లో ఇంటింటి జ్వర సర్వే నిర్వహించారు. మలేరియా నిర్మూలనలో భాగంగా నివాసితులందరి రక్తనమూనాలు సేకరించారు. అధిక వర్షాల కారణంగా గర్భిణులు ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. వైద్యుల సూచనల మేరకు గర్భిణులు ముందస్తుగా ఆసుపత్రుల్లో చేరాలని అధికారులు సూచిస్తున్నారు.

పారిశుద్ధ్యం మెరుగు...

వర్షాకాలంలో మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. చిన్నపాటి వర్షాలకే వీధులు చెరువులను తలపిస్తాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమవుతాయి. మురుగునీరు, వ్యర్థాలు ఇళ్లల్లోకి చేరటంతో వ్యాధులు సోకుతాయి. వానాకాలం ముగిసే వరకు గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం, మురుగునీటి నిర్వహణపై దృష్టి సారించాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

డ్రై డే

వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది అనేక రోగాలకు కారణమవుతాయి. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు వారంలో ఒకరోజు(శుక్రవారం) డ్రైడే పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ఇంటింటికీ పంచాయతీ కార్యదర్శి, ఆశా కార్యకర్త, అంగన్వాడీ టీచర్, పారిశుద్ధ్య సిబ్బంది వెళ్లి నీటి నిల్వ వల్ల దోమలు ఏవిధంగా వృద్ధి చెందుతాయనే అంశంపై అవగాహన కల్పిస్తారు.

జాగ్రత్తలు ఇవే...

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలి. నిల్వ పదార్థాలను తినరాదు. బయటి తినుబండరాలకు దూరంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగడం ఉత్తమం. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. ఓవర్హెడ్ ట్యాంకులు, నీటిసంపులు, నీటిపాత్రలపై నిరంతరం మూతలు ఉంచాలి. వారానికోసారి నీరు నిల్వ ఉన్న పాత్రలు, డ్రమ్ములను ఖాళీ చేసి శుభ్రపర్చాలి.

ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా చర్యలు

వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానాల్లో వైద్యులతోసహా వైద్యారోగ్యశాఖ సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

-డాక్టరు రఘునాథస్వామి, డీఎంహెచ్ఓ, మేడ్చల్ జిల్లా

'ప్రజావాణి'లో ఫిర్యాదు చేయండి

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు కమిషనర్ రాజమల్లయ్య తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో నివసించే ప్రజలు సమస్యలపై ప్రజావాణి కార్యక్రమంలో ఆర్జీల రూపంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్యాస్ స్టౌ వితరణ



గ్యాస్ స్టౌ అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: పూడూర్ అంగన్‌వాడీ కేంద్రానికి జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి, గ్రామ మాజీ వార్డుసభ్యుడు హన్మంత్‌రెడ్డి గ్యాస్ స్టౌ ను వితరణ చేశారు. దీనిని శనివారం అంగన్‌వాడీ టీచర్ శ్రీలతకు అందజేశారు.

ఈటలను కలిసిన బీజేపీ నేతలు



ఈటలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి, బాలేశ్ తదితరులు

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి ఎంపీగా విజయం సాధించిన ఈటల రాజేందర్‌ను ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు బాలేశ్ తదితరులు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శనివారం కలిశారు. ఆయన ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.

ప్రజాకళాకారుడు రాజు మృతి



రాజు పార్థీవదేహానికి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గిరిప్రసాద్‌నగర్‌లో ప్రజానాట్య మండలి కళాకారుడు రాజు(52) అనారోగ్య సమస్యలతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ నాయకులు పలువురు రాజు భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్. బాలమల్లేష్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో తన ఆటపాటలతో ప్రజలను ఉత్తేజపరిచిన రాజు మృతి తీరని లోటన్నారు. సీపీఐలో ఆయన క్రియాశీలకంగా పనిచేశారని అన్నారు. నివాళులు అర్పించినవారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్, దర్శనం యాదగిరి, రాజేశ్వరి, ఎల్లయ్య, లక్ష్మణ్, సహదేవ్, శ్యామల, లత, సత్యం, కురుమయ్య, శ్రీను, పద్మమ్మ తదితరులు ఉన్నారు.

కేజీఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కీసర: కేజీఆర్ కళాశాల పూర్వవిద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవడం సంతోషంచదగ్గ విషయమని ఆ కళాశాల చైర్మన్ గోవిందరెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలో గల కేజీఆర్ కళాశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా కళాశాల విద్యార్థులకు అన్ని వసతుల మధ్య నిపుణులైన అధ్యాపకులతో బోధన చేపట్టి వారి ఉన్నతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ పి.వి.రమణారావు, ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ, అసోసియేట్ ప్రెసిడెంట్ రవీందర్‌రెడ్డి, కార్యదర్శి నితిన్‌రెడ్డి, హెచ్‌వోడీ రంగేశ్వర్‌రెడ్డి, సునీత, వేణు, రాజశేఖర్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేజీఆర్ కళాశాల చైర్మన్ గోవిందరెడ్డి

మంత్రాల పేరిట నమ్మించి అత్యాచారం



నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్న మేడ్చల్ పోలీసులు

మేడ్చల్‌రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు మంత్రాల పేరిట మాయమాటలు చెప్పి అత్యాచారం చేసి పరారైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నిందితుడిని గంటల వ్యవధిలో పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం ... ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి గత కొంత కాలంగా మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి కిష్టాపూర్ గ్రామంలో తన భార్యతో కలిసి నివాసం ఉంటూ మండలంలోని రావల్‌కోల్ గ్రామ పరిధిలో ఉన్న సింగానియా చాక్లెట్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా తన భార్య ఆరోగ్యం బాగోలేదని సదరు కార్మికుడు అదే కంపెనీలో పనిచేసే ఒడిశా రాష్ట్రానికి చెందిన షేక్ మోసిన్(41)కు చెప్పాడు. దీంతో తనకు మంత్రాలు వచ్చని, వాటితో నయం చేస్తానని నమ్మించాడు. దీంతో సదరు కార్మికుడు గత శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో తన తమ్ముడిని, షేక్ మోసిన్‌ను ఇంటికి రప్పించాడు. అనంతరం అతను డ్యూటీకి వెళ్లిపోయాడు. ఇంట్లోకి వెళ్లి మంత్రం వేస్తానని, మంత్రం వేసేటప్పుడు అరుపులు వినిపిస్తాయని వాటిని పట్టించుకోకుండా బయటనే ఉండమని కార్మికుడి తమ్ముడినిఇ మోసిన్ బయటకు పంపించాడు.. అనంతరం గదిలోకి వెళ్లి తలుపులు వేసి మహిళపై అత్యాచారానికి పాల్పడ అక్కడి నుంచి పరారయ్యాడు. అవమానం భరించలేక బాధిత మహిళ సింధూరం బొట్టును నీటిలో కలిపి ఆత్మహత్యకు యత్నించింది. బాధితురాలు కిందపడిపోవడంతో అనుమానం వచ్చి ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. చికిత్స అనంతరం కోలుకున్న బాధితురాలు జరిగిన విషయం తన భర్తకు తెలపడంతో శనివారం ఉదయం మేడ్చల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు తగిన ఆధారాలు సేకరించి నిందుతుడిని పట్టుకునేందుకు పలు బృందాలను ఏర్పాటు చేసి గంటల వ్యవధిలో నిందితుడిని అదుపు లోకి తీసుకున్నారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

గేదెలు తరలిస్తున్నవారిపై కేసు



ఘట్‌కేసర్: అతి క్రూరంగా గేదెలు తరలిస్తున్న వారిపై ఘట్‌కేసర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ సైదులు వివరాలు ఇలా ఉన్నాయి. కొండమడుగు వైపు నుంచి వాహనంలో మూడు గేదెలను తాళ్లతో బంధించి గాలి కూడా సరిగా అందని స్థితిలో అక్రమంగా తరలిస్తుండగా అవుషాపూర్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. గేదెలను తరలించడానికి సర్రియైన అనుమతి పత్రాలు కూడా లేవు. గేదెలను జియాగూడ గోశాలకు పంపించి పోలీసులు వాహనం సీజ్ చేశారు. అనంతరం గేదెలు తరలిస్తున్న సంగారెడ్డి జిల్లా రామన్నపేట నివాసి మహమ్మద్ ఇస్మాయిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యకమాలు ఆకట్టుకున్నాయి. నటరాజ కూచిపూడి డాన్స్ అకాడమీ సుప్రియ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గంధము పూయరుగా, మూషిక వాహన, అయిగిరి నందిని, అన్నమాచార్య కీర్తన, తదితర అంశాలను కళాకారులు మనస్వి, వసుంధర,హసహైన్దవి, సహస్ర, ప్రణీత తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

అన్నదానం



కీసర: చీర్యాల శ్రీ లక్ష్మీనృసింహ్మస్వామి దేవస్థానంలో ప్రతి శనివారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ తెలిపారు. శనివారం దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

రామంతాపూర్: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ప్రజలలో యోగా ఆరోగ్యం, ఆహార నియమాలు చక్కని జీవన శైలి విషయాల మీద అవగాహన కలిగించేందుకు రామంతాపూర్‌లోని బాలభారతి పాఠశాల ప్రాంగణంలో జూన్ 10 తేదీ నుంచి 22వ తేదీ వరకు ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ యోగా నిపుణులు థెరపిస్ట్ డాక్టర్ దొడ్ల సత్యారెడ్డి శనివారం తెలిపారు. ఈ ఉచిత తరగతులు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ ద్వారా కూడా నిర్వహిస్తున్నామని వివరాలకు 9246173775లో సంప్రదించాలన్నారు.

బోడుప్పల్‌లో రేపు ప్రజావాణి

బోడుప్పల్: మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కమిషనర్ రామలింగం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రతి సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అండర్ పాస్.. ఇంకెన్నాళ్లకు..?

- స్తంభించిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జీల నిర్మాణాలు
- కొత్త ఎంపీకి మేడ్చల్‌లో సమస్యల స్వాగతం
- తక్షణమే దృష్టి పెట్టి పరిష్కరించాలని స్థానికుల విజ్ఞప్తి



ఘట్‌కేసర్ లో రైల్వే గేట్ వద్ద అసంపూర్తిగా పిల్లర్ల వరకే పరిమితమైన ఫ్లైఓవర్



మేడ్చల్‌లో అసంపూర్తిగా మిగిలిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి

మేడ్చల్: మల్కాజ్‌గిరి నూతన ఎంపీ ఈటల రాజేందర్‌కు ప్రజాసమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ముఖ్యంగా మేడ్చల్ నియోజకవర్గంలో రైల్వే శాఖకు సంబంధించిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా సాగుతున్న రైల్వే , ఇతర శాఖల పనులపై ఈటల దృష్టి పెట్టి కేంద్ర ప్రభుత్వం కొలువుదీరగానే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. మేడ్చల్, గుండ్ల పోచంపల్లి, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలలో అండర్ పాస్ రైల్వే బ్రిడ్జీల పనులు నత్తనడకన సాగుతుండటంతో ఆ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాకపోకలకు ఆటంకంగా మారాయి. వరంగల్, కరీంనగర్ రహదారులను కలిపే రోడ్డుపై ఘట్‌కేసర్ రైల్వే గేట్ వద్ద 2014లో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. దీనికి నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి శంఖు స్థాపన చేశారు. అది 11 ఏళ్ళుగా సాగుతూనే ఉంది. ఇంకా పూర్తికాలేదు.


మేడ్చల్-గిర్మాపూర్ రూట్‌లో...

మేడ్చల్ పట్టణంలో గిర్మాపూర్ మార్గంలోని రామలింగేశ్వర ఆలయ సమీప రైల్వే గేట్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణాన్ని ఐదేళ్ల క్రితం ప్రారంభించి సగంలోనే వదిలేశారు. దీంతో మేడ్చల్ నుంచి 5 గ్రామాలకు, 10 కాలనీలకు, దుండిగల్ మండలానికి వెళ్లే వారు ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నారు. కండ్లకోయ నుంచి గుండ్లపోచంపల్లి రూట్‌లో రైల్వే ట్రాక్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఊళ్ళు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. మేడ్చల్ నుంచి మైసమ్మగూడకు వెళ్లే కళాశాల విద్యార్థులు, గుండ్లపోచంపల్లిలోని పరిశ్రమలకు వెళ్లే కార్మికులు అధికంగా ఉన్నారు. ఈ మార్గాన్ని పూర్తిగా మూసివేయడంతో అయోధ్య చౌరస్తా, లేదంటే కొంపల్లి మీదుగా తిరిగి వెళ్ళాల్సి వస్తోంది. మేడ్చల్-గౌడవెల్లి రూట్‌లో గౌడవెల్లిలో గేట్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి గేటు వద్ద రాకపోకలు నిలిపివేశారు. దీంతో బాసిరేగడి, జ్ఞానాపూర్ గ్రామాలకు, దుండిగల్ తదితర ప్రాంతాలకు రింగు రోడ్డు మీదుగా వెళ్ళాల్సి వస్తోంది. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో అండర్ పాస్ బ్రిడ్జి మంజూరు చేయించి నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల కోసం...

మేడ్చల్, ఘట్‌కేసర్ రైల్వే రూట్లలో నిత్యం దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎన్నో ఎక్స్‌ప్రెస్ రైళ్ళు వెళుతున్నాయి. అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ళు మేడ్చల్, ఘట్‌కేసర్ స్టేషన్‌లలో నిలిపేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.


ఎన్నిసార్లు చెప్పినా.. అంతే



మా ఇళ్ళు ట్రాక్ అవతలి వైపు ఉండటంతో ద్విచక్ర వాహనాల్లో కాకుండా ఇతర వాహనాల్లో 10 కిలోమీటర్ల దూరం తిరిగి రావాల్సి వస్తోంది. ప్రతి ఒక్కరూ అసంపూర్తి బ్రిడ్జి వల్ల ఇబ్బందులు పడుతున్నారు. చినుకు పడితే ఇక అంతే.

-రాజు, మేడ్చల్


ఈటల పట్టించుకోవాలి



మేడ్చల్, గుండ్లపోచంపల్లి, గౌడవెల్లిల వద్ద అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణాల కారణంగా గేట్లు మూసివేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. దీంతో కళాశాల విద్యార్థులు, ఆయా పరిశ్రమలకు వెళ్లే కార్మికులు వందల సంఖ్యలో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈటల ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలి.

-మరిలు, జ్ఞానాపూర్

అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ళు ఆగేలా చూడాలి



మేడ్చల్, ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌లలో అన్ని రైళ్లు ఆగేలా చూడాలి. తిరుపతి, అజ్మీర్, విజయవాడ, విశాఖపట్నం, నాగపూర్, నాందేడ్, ఢిల్లీ, ముంబై తదితర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు ఇక్కడ ఆగేలా చేయాలి.

-కన్నా, మేడ్చల్